క్లుప్తంగా

విజయసాయిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే అన్నా



విజయసాయిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: పార్లమెంట్ సభ్యుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రీజనల్ కో ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డిని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు విజయవాడ ఎంపీ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు రాజకీయ విషయాలతో పాటు ప్రభుత్వం పరంగా జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి చర్చించినట్లు తెలుస్తోంది.

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువుకు చెందిన పూజ గాలెమ్మ సహజ మరణం చెందడంతో నామినీకి మట్టి ఖర్చుల నిమిత్తం సర్పంచ్ షాజహాన్ 10 వేల రూపాయలు వైఎస్సార్ బీమా కింద అందజేశారు. మిగిలిన 90 వేల రూపాయలు నామినీ అకౌంట్‌లో త్వరలోనే జమవుతాయని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు షరీఫ్, పఠాన్ అబ్దుల్ కరీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి కుర్చీలు అందజేత

గిద్దలూరు రూరల్: పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయానికి యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ మొర్రి పిచ్చయ్య యాదవ్ మంగళవారం కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఓ.వెంకటయ్య మాట్లాడుతూ ఆలయంలో భక్తులకు ఉపయోగపడే విధంగా దాత పిచ్చయ్య యాదవ్ కుర్చీలు అందజేయడం చాలా మంచి విషయమన్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు బాల గురవయ్య, యల్లయ్య, పాండు, మోహన్‌కృష్ణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

25న వరలక్ష్మి పూజలు

గిద్దలూరు రూరల్: శ్రావణమాసం సందర్భంగా ఈ నెల 25వ తేదీన శుక్రవారం రోజు పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని అమ్మవారి మూల విరాట్ మూర్తి అమ్మవారిని లక్ష్మీదేవిగా ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

దొంగ ఓట్లు గుర్తించండి

దర్శి: దొంగ ఓట్లు, ఒక్కొక్కరికి రెండు చోట్ల ఉండే ఓట్లు గుర్తించి తమ దృష్టికి తీసుకువస్తే తొలగిస్తామని ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి, ఎన్నికల అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీ నాయకులతో ఎన్నికల సందర్భంగా సమావేశం నిర్వహించారు. అనంతరం డీవీఎస్ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 2024 జనవరి నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు ఉన్న వారి వివరాలు తెలియపరిచి ఓటు హక్కు పొందాలన్నారు. దర్శి, దొనకొండ, కురిచేడు, ముండ్లమూరు, తాళ్లూరు తహసీల్దార్లు వెంకటేశ్వరరావు, యం. సువర్ణ, జ్వాలా నరసింహారావు, చయుం అహమద్, కేవీ ప్రసాద్, నగర పంచాయతీ కమిషనర్ వై. మహేశ్వరరావు, డీటీ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివాలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ముండ్లమూరు: మండలంలోని పసుపుగల్లులో గంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి వారి 15వ వార్షికోత్సవాలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని భక్తులు, పొంగళ్లు పొంగించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. పూజారులు నూతలపాటి ప్రసాద్‌శర్మ, వెంకటేశ్వరశర్మ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యార్థులకు చేయూత

దర్శి: గత రెండు సంవత్సరాలుగా తూర్పు వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఏపీ స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ కాసు మహేష్‌రెడ్డి, విజిలెన్స్ ఎస్సై కాసు వెంగళరెడ్డి.. విద్యార్థులకు పెన్‌లు, కీచైన్‌లు మంగళవారం అందజేశారు. ఉపాధ్యాయులు వారిని అభినందించారు. హెచ్ఎం కొల్లూరి ప్రకాశరావు, ఉపాధ్యాయులు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కంచర్ల వీరయ్య సేవలు మరువలేనివి

● విగ్రహావిష్కరణ సభలో మంత్రి సురేష్



వీరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

పుల్లలచెరువు: ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కంచర్ల వీరయ్య సేవలు మరువలేనివని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం కంచర్ల వీరయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా పుల్లలచెరువులో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి వీరయ్య విగ్రహాన్ని మంత్రి సురేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి వీరయ్య చేసిన సేవలు విలువకట్టలేనివని, పార్టీ కోసం అహర్నిశలూ కృషి చేశారని, ఈ ప్రాంత ప్రజల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. పుల్లలచెరువులో ఒక వీధికి వీరయ్య పేరు పెట్టే విధంగా పంచాయతీ తీర్మానం చేయాలని కోరారు. వీరయ్య కుటుంబానికి ఎప్పుడూ పార్టీ అండగా ఉంటుందన్నారు. పలువురు వక్తలు వీరయ్య చేసిన సేవలను కొనియాడారు. ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, పార్టీ కన్వీనర్ రెంటపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ లాజర్, జెడ్పీటీసీ వాగ్యానాయక్, ఎంపీటీసీ రాములు, పీఏసీఎస్ డైరెక్టర్ రఘు, గడ్డం సుబ్బయ్య, ఆంజనేయులు, కాశయ్య, వెంకటరెడ్డి, గంగరాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణంపై ప్రజల హర్షం



రాయవరం గ్రామంలో వేసిన సీసీ రోడ్డు



వేములకోట గ్రామంలో సీసీ రోడ్డు

మార్కాపురం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఒక్కో గ్రామ సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా మార్కాపురం మండలంలోని వేములకోట, రాయవరం బోడపాడు, తదితర గ్రామాల్లో పంచాయితీరాజ్ అధికారులు సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టి త్వరిత గతిన పూర్తిచేస్తున్నారు. మట్టిరోడ్ల స్థానంలో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తుండటంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో అంతర్గత రహదారుల సమస్యను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వేగంగా పనులు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణంతో అంతర్గత రహదారుల రూపురేఖలే మారిపోతున్నాయి.

సర్పంచ్ మాతృమూర్తికి ఎమ్మెల్యే నివాళి



కాశమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

తర్లుపాడు: మండలంలోని మీర్జపేట సర్పంచ్ డి.పెద్ద మీరయ్య తల్లి కాశమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. సర్పంచ్‌తోపాటు ఆయన సోదరులు కాశయ్య, చిన్నకాశయ్య, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, పార్టీ కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు పార్వతీ రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు డి.పెద్దమస్తాన్, రామిరెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి, బాలయ్య, షాజహాన్, నవ్య, పి.వరాలు, జాన్‌రత్నం, తిరుమల బాలసుబ్బమ్మ, సొసైటీ ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమగ్ర సస్యరక్షణపై అవగాహన



మాట్లాడుతున్న రిసోర్స్‌పర్సన్ లక్ష్మీరెడ్డి

పెద్దారవీడు: పంటల తెగుళ్ల నివారణకు సమగ్ర సస్య రక్షణపై రైతులకు అవగాహన కలిగి ఉండాలని రిసోర్స్ పర్సన్ లక్ష్మీరెడ్డి అన్నారు. మండలంలో తోకపల్లిలో రిలయన్స్ ఫౌండేషన్, ఎఫోర్ట్ ఆధ్వర్యంలో సమగ్ర సస్యరక్షణ పద్ధతుల గురించి మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ సాగు చేసిన పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణకు పసుపు, నీలం అట్టలు, లింగాకర్షణ బుట్టలు, బంతిపూల మొక్కలు అక్కడక్కడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డీపీఓ సురేష్, శివ పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించిన విద్యుత్ శాఖ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



జేసీబీతో ఒరిగిన స్తంభాన్ని సరిచేయిస్తున్న అధికారులు

బేస్తవారిపేట: మండలంలోని పాపాయిపల్లె, కొత్తపల్లెలో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో ఇబ్బందికరంగా మారింది. దీనిపై «సాక్షి»లో ఈ నెల 20వ తేదీన ఒరిగిన విద్యుత్ స్తంభాలతో అవస్థలు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఏడీఈ బాలఅంకయ్య, ఏఈ సన్యాసిరావు స్పందించారు. పాపాయిపల్లెలో పోలేరమ్మ గుడి సమీపంలో పొలాల్లోని విద్యుత్ స్తంభాలు ఒకవైపునకు ఒరిగిపోవడంతో సరిచేశారు. కొత్తపల్లె బస్టాండ్ సమీపంలో సింగల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న విద్యుత్ స్తంభం పూర్తిగా ఒకవైపునకు ఒరిగిపోవడంతో జేసీబీతో యంత్రంతో సరిచేసి సపోర్ట్ తీగను ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

విద్యుత్ కోతలపై ఆందోళన



సబ్‌స్టేషన్‌లో సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న రైతులు

ముండ్లమూరు: మండలంలోని వేంపాడులో అకారణంగా విద్యుత్ కోతలు విధించిడం పట్ల ఆ గ్రామ రైతులు సిబ్బందిని నిలదీశారు. గ్రామంలో అప్రకటిత విద్యుత్ కోతలతో రైతులు సాగు చేసిన పంటలకు నీరందక ఎండుపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మంగళవారం సాయంత్రం ముండ్లమూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకొని విద్యుత్ కోతలపై నిలదీశారు. సబ్ ఇంజినీర్ జోక్యం చేసుకొని సబ్‌స్టేషన్‌లో సాంకేతిక లోపం కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని రైతులకు సర్ది చెప్పారు. వెంటనే శంకరాపురం సబ్‌స్టేషన్ నుంచి వేంపాడు గ్రామానికి విద్యుత్ సరఫరా చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ భగీరథి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.భగీరథి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించారు. పిల్లలకు పెడుతున్న పౌష్టికాహారం వివరాలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. పిల్లలు ఎత్తు, వారి బరువును పరిశీలించి వారికి సరైన ఆహారం అందజేయాలని సూచించారు. ఆమె వెంట సీడీపీఓ జ్యోతి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

326 మందికి వైద్య పరీక్షలు



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఐటీడీఏ పీఓ రవీంద్రరెడ్డి

యర్రగొండపాలెం: గిరిజన ప్రాంతాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం హర్షించదగిన విషయమని ఐటీడీఏ పీవో బి.రవీంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాద్రిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గిరిజనులు తమకున్న జబ్బులను దూరప్రాంతాల్లో ఉన్న వైద్యశాలలకు వెళ్లి పరీక్షలు చేయించుకోలేరని, ఆ జబ్బును నిర్లక్ష్యం చేసి తమ ప్రాణాలపైకి తెచ్చుకుంటారని, ఇటువంటి వైద్య శిబిరాల్లో పరీక్షలు చేయించుకుంటే వెంటనే చికిత్స చేయించుకునే అవకాశం ఉంటుందన్నారు. వైద్యశిబిరంలో 326 మందికి వైద్య పరీక్షలు చేసి రోగులకు, రక్త హీనత కలిగిన గర్భిణులు, బాలింతలకు మందులు పంపిణీ చేశామని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఒంగోలులోని రవి తల్లి పిల్లల వైద్యశాల, ప్రశాంతి వైద్యశాలకు చెందిన ప్రముఖ డాక్టర్లు శిబిరంలో పాల్గొని రోగులను పరీక్షించారు. వైద్యశిబిరంలో వైద్య,ఆరోగ్య శాఖ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, సర్పంచ్ శ్రీశైలపతినాయుడు, పీహెచ్‌సీ డాక్టర్లు వి.కోటా నాయక్, షేక్ నాయబ్ రసూల్, ఆరోగ్యశ్రీ డీఎం కిరణ్, డీటీఎల్ హెప్సిబా, వెంకట్రావ్, రత్నం, ఆరోగ్య మిత్రలు జీసీ శేఖరాచారి ప్రభాకర్, లింగయ్య పాల్గొన్నారు.

395 మందికి వైద్య పరీక్షలు

కొమరోలు: మండలంలోని అల్లినగరంలో మంగళవారం గిద్దలూరుకు చెందిన డాక్టర్ బ్రహ్మానందరెడ్డి ప్రజావైద్యశాల ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందరెడ్డి తన వైద్య సిబ్బందితో కలిసి 395 మందికి వైద్య పరీక్షలు చేశారు. రోగ నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు అందజేశారు.

వైభవంగా గంగమ్మతల్లి కొలుపులు, ప్రతిష్ట



మాతుడుపులో భాగంగా పుట్ట వద్దకు చేరిన గోరంట్ల వంశస్తులు

బల్లికురవ: మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామంలో గోరంట్ల వారి దేవర గంగమ్మ తల్లి కొలుపులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఆలయంలోని శిలలు బోల్లి ఆవులతో చీరాల సముద్రస్నానానికి తరలి వెళ్లారు. మంగళవారం గ్రామోత్సవంతో పుట్ట బంగారం, మాతుడుపు చేపట్టారు. రాత్రికి బొల్లి ఆవులతో గ్రామోత్సవం, బుధవారం తెల్లవారు జామున 3 గంటలకు ఆలయంలో గంగమ్మ తల్లిని ప్రతిష్టించనున్నారు. నూతన ఆలయం నిర్మాణం కొలుపుల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఉన్న గోరంట్ల కుటుంబ సభ్యులంతా తరలిరావటంతో గ్రామంలో పండగ వాతావరణ నెలకొంది. ప్రతిష్ట తదుపరి బుధవారం రాత్రికి గ్రామంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. ఈవేడుకల్లో గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లోని ప్రజలు పాల్గొని ఈర్ల గంగమ్మ ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ కోరారు.

జర్నలిస్టు కుటుంబానికి మంత్రి పరామర్శ



రామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

పుల్లలచెరువు: ఉమ్మడి రాష్ట్రంలోని పలు పత్రికల్లో వివిధ హోదాల్లో పనిచేసి అనారోగ్య కారణాలతో ఇటీవల మరణించిన పుల్లలచెరువుకు చెందిన ఆకుల రామయ్య కుటుంబాన్ని మంగళవారం వారి నివాసానికి వెళ్లి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పరామర్శించారు. రామయ్య ప్రతికల్లో చేసిన సమయంలో తెలుసని, చిన్న వయసులోనే తనువు చాలించడం బాధాకరమన్నారు. మంత్రి వెంట ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ జానకి రఘు, ఎంపీటీసీ రాములు ఉన్నారు.

27న చెస్ పోటీలు

మార్కాపురం: ఈ నెల 27న మార్కాపురం పట్టణంలోని అరవింద స్కూల్లో ఏపీ చెస్ అకాడమీ ఒంగోలు వారి ఆధ్వర్యంలో అండర్-6 నుంచి అండర్-14 వరకు బాలబాలికలకు చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు ఆర్.ఆంజనేయులు తెలిపారు. ఈనెల 25లోగా 93461 52190ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. చెస్ బోర్డులు ఎవరివి వారే తెచ్చుకోవాలని స్పష్టం చేశారు.

థ్యాంక్యూ సీఎం సార్..!



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సురేష్

పుల్లలచెరువు: థ్యాంక్యూ సీఎం సార్.. అంటూ రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌కు పుల్లలచెరువు జెడ్పీ పాఠశాల విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం జెడ్పీ పాఠశాలలో అదనపు తరగతి గదులు ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రి సురేష్.. విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. జగనన్న విద్యాకానుక, ట్యాబ్‌లు ఇచ్చారా, అమ్మఒడి, మధ్యాహ్న భోజన పథకంపై విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. విద్యార్థులు కూడా ఉత్సాహంగా స్పందించి మంత్రికి మా లాంటి పేద విద్యార్థులకు జగన్ మామయ్య తీసుకున్న నిర్ణయాలతో మేలు జరుగుతుందన్నారు.

డిసెంబర్‌లోగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

● హౌసింగ్ జేఎండీ శివప్రసాద్



బ్రిక్స్ యూనిట్‌ను పరిశీలిస్తున్న హౌసింగ్ జేఎండీ

పొదిలి: జగనన్న కాలనీల్లో డిసెంబర్ 31వ తేదీలోగా గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా హౌసింగ్ అధికారులు చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ సంస్థ జేఎండీ ఎం.శివప్రసాద్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక జగనన్న లేఔట్‌ను ఆయన సందర్శించారు. అధికారులు, లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే మొదలుపెట్టేలా చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించని వారి పట్టాలు రద్దు చేసి మరొకరికి కేటాయిస్తామని హెచ్చరించారు. గృహాల నిర్మాణాలను కాంట్రాక్ట్ తీసుకున్న సంస్థ అధిక సంఖ్యలో కూలీలను నియమించుకుని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారు షేక్.షబానా ఇంటిని సందర్శించి అందరూ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. లేఔట్‌లో మౌలిక సదుపాయాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని చెప్పారు. అనంతరం బ్రిక్స్ యూనిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఈ.పేరయ్య, ఈఈ ఎం.కోటిరెడ్డి, డిప్యూటీ ఈఈ ఎ.పవన్‌కుమార్, ఏఈ జి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి



సహకారం సంఘాల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీసీఓ రాజశేఖర్

ముండ్లమూరు: సహకార సంఘాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీఓ రాజశేఖర్ తెలిపారు. స్థానిక వైఎస్సార్ కేపీ కార్యాలయంలో మంగళవారం సహకారం సంఘ ప్రతినిధులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పరపతి సంఘాలకు రుణ పరపతిని పెంచి రైతులకు అవసరమైన రుణాలను అందజేస్తుందన్నారు. చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహిస్తూ వ్యవసాయ పనిముట్లను రాయితీపై అందజేస్తామని తెలిపారు. పాడిపరిశ్రమలను అభివృద్ధి చేయడంలో భాగంగా డైరీ ఏర్పాటు కోసం రుణాలు ఇస్తున్నామన్నారు. రైతులకు పంట రుణాలను అందిస్తూ వారి అభివృద్ధికి పాటుపడుతున్నాని చెప్పారు. మహిళా పాల కేంద్రాలకు చట్ట బద్ధత కల్పించి వారికి రుణాలు ఇస్తామని వివరించారు. ఏడీసీఓ వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది జిలానీ బాషా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గానామృతం



లలితా దేవి జయంతి మహోత్సవాలు

ఒంగోలు మెట్రో: స్థానిక కేశవస్వామి పేటలో లలిత ఆశ్రమంలో లలితా దేవి 40వ జయంతి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారి అభిషేకం, శ్రీ చక్రానికి సహస్రనామార్చన, మంగళ గౌరి వ్రతం, కుంకుమార్చన, నిర్వహించి తీర్థప్రసాద వితరణ గావించారు. మధ్యాహ్నం 3 గంటలకు గీతాచార్య, గంజి పిచ్చయ్య శేష్టి, కోటిరత్న వారి బృందంచే సామూహిక లలితా సహస్రనామ పారాయణం జరిగింది. రాత్రి 7 గంటలకు గాన గంధర్వ ఘోరకవి సంపత్‌కుమార్ వారి బృందంచే శ్రీకృష్ణ లీలా తరంగిణి గానామృతం నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అర్చక స్వాముల చేత తీర్థప్రసాదాలు సేకరించి వారిచే వేద ఆశీర్వచనం తీసుకున్నారు. లలిత ఉపాధ్యాక్షులు రాష్ట్ర సనాతన ధార్మిక సంఘం అధ్యక్షుడు స్వయంపాకుల కోటేశ్వర శర్మ, అగస్త్యరాజు, శివ సుబ్రహ్మణ్యం వారి పరివేక్షణ నిర్వహించారు.

వైభవంగా వెంకయ్య స్వామి నగరోత్సవం



నగరోత్సవంలో ప్రత్యేక అలంకరణలో వెంకయ్య స్వామి

ఒంగోలు మెట్రో: భగవాన్ గొలగమూడి వెంకయ్య స్వామి వారి విగ్రహ ప్రతిష్ట ప్రథమ వార్షికోత్సవం, 41వ ఆరాధన మహోత్సవాలు స్థానిక సంతపేటలోని వెంకయ్య స్వామి ఆలయంలో మంగళవారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. వెంకయ్య స్వామికి ప్రత్యేక పూజలు హారతి కార్యక్రమాలను అర్చక స్వాములు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి వెంకయ్య స్వామి వారి చిత్రపటాన్ని వివిధ రకాల పూలతో అందంగా పుష్పాలంకరణ గావించి రథంలో స్వామి చిత్రపటాన్ని స్థానిక భక్తులు ఆలయ నిర్వాహకులు అర్చక స్వాములు నగర పుర వీధుల ఊరేగించారు. స్థానిక భక్తులు స్వామివారి చిత్రపటానికి మంగళ హారతులు ఇచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. నగర ఊరేగింపులో ప్రత్యేకంగా మైనంపాడు భజన బృందం వారు ఆలపించిన స్వామి గీతాలు భక్తులను ఎంతో అలరింపజేశాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు సేకరించారు. ఈ ఉత్సవాలను ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి వారు తెలిపారు.